క్లుప్తంగా

నేడు రాజగోపుర ప్రతిష్ఠ

కంచికచర్ల: శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం విమాన శిఖర, రాజగోపుర ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవానికి అందరూ హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

భక్తులు సహకరించాలి: ఎస్ఐ

కంచికచర్ల : స్థానిక పెద్దబజార్‌లో నూతనంగా పునర్నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి, శ్రీ రాజ్యలక్ష్మీదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవానికి వచ్చే భక్తులంతా వాహనాలపై కాకుండా నడుచుకుంటూ రావాలని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామాలయంకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉన్న విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఉదయం 11గంల తర్వాతే రావాలని, ఆయా వాహనాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన పార్కింగ్‌స్థలంలోనే నిలుపుదల చేసి, నడుచుకుంటూ ఆలయానికి చేరుకోవాలన్నారు. భక్తులు, ప్రజలు ఆలయ కమిటీ సభ్యులకు, పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఎస్ఐ కోరారు.

సచివాలయ కార్యదర్శులతో సమీక్ష



పెనుగంచిప్రోలు: ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలు జరగాలని ఎంపీడీఓ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)చైర్మన్ సాయిహర్ష పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. విధుల్లో అలక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈవోపీఆర్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ చిన్న తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించే అమ్మవారి పుట్టింటి పసుపు–కుంకుమ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని నందిగామ ఏసీపీ డా.రవికిరణ్ కోరారు. పసుపుకుంకుమ బండ్ల రాకపోకలకు సంబంధించి ఆలయ పరిసరాల్లో చేసిన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆలయ అధికారులకు పలుసూచనలు చేశారు. మునేరులో భక్తులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, ఎస్ఐ పి.రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



కొణకంచి(పెనుగంచిప్రోలు):గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం పెనుగంచిప్రోలును సందర్శించారు. సామాజికపటం, గ్రామసౌకర్యాలు, ఆయా పంటలను పండించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న మద్దతు ధరలు గురించి పటం ద్వారా వివరించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ఎస్ కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు రైతుల సాయంతో పంటలు పండించే విధానాలను తెలుసుకుని కొత్త మెళుకువలను సూచించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త వెంకటరెడ్డి, విద్యార్థులు త్రిలోక్, రమణారెడ్డి, శ్రీహరిప్రసాద్, శ్రీనివాసరెడ్డి, శరవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఊయల బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం ఆలయ డోలు విద్యాంసుడు గుంటుపల్లి సత్యనారాయణ సుమారు రూ.20వేల విలువ కలిగిన టేకు ఊయలను ఆలయ ఈవో కె.రమేష్ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలన మా సమర్థతకు నిదర్శనం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామలోని ఐదోవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మంచి జరిగితేనే ఓటు వేయండని సగర్వంగా చెబుతున్నామని ఇది మా నిజాయితీకి, సమర్థ పాలనకు నిదర్శనమని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఐదోవార్డు పరిధిలోని కోట్ల బజారు, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో చేసిన మంచితోపాటు నందిగామ పట్టణంలో జరిగిన ఐదేళ్ల అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన డాక్టర్ జగన్‌మోహనరావును ప్రజలు సాదరంగా ఆహ్వానించి ఆప్యాయంగా పలకరించారు.

రహదారులకు మహర్దశ..

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని నవ నందిగామగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. గడిచిన 30ఏళ్లుగా నందిగామను దాదాపుగా టీడీపీ ప్రజాప్రతినిధులే పాలించారని, గత పాలనకు మా ఐదేళ్ల పాలనకు తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ముఖ్యంగా తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జాతీయ రహదారిని అనుసంధానించేలా పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధి, విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అందులోభాగంగానే నందిగామలోని సీఎం రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. రామన్నపేట, చందర్లపాడు రోడ్లను సైతం విస్తరించడంతోపాటు అభివృద్ధి చేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు సహించడం లేదని ఎద్దేవా చేశారు. రోడ్డు, డివైడర్ పనులను అడ్డుకుని వారు పైశాచికానందాన్ని పొందుతుండటం తగదని హితవు పలికారు. పట్టణంలోని వ్యాపారులకు అన్నిరకాలుగా అండగా ఉంటానని తెలిపారు. గత పదేళ్లలో నందిగామ నియోజకవర్గంలో మావల్ల ఎవరికీ హాని కానీ, నష్టం కానీ జరగలేదన్నారు. చేతనైనంత మంచి చేయటానికే కృషి చేస్తున్నామని ఆదరించి మరోసారి ఆశీర్వదిస్తే అన్నిరకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు నల్లమల్లి మురళి, సూరె రామారావు, పరిశ మల్లి, సముద్రాల మధు, ముప్పల శ్రీను,పాములపాటి రమేష్, నాదెండ్ల నరేంద్ర, ఓర్సు జ్వాలా, గుడివాడ సాంబశివరావు,ఓర్సు కొండ, షేక్ ఫాతిమా, సతీష్‌రెడ్డి, బండారు వెంకట్రావ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



తన విజయానికి సహకరించాలని కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



రాత్రుళ్లు ఆలయం చుట్టూ భక్తజనం



విద్యుత్ దీపకాంతులతో ఎగ్జిబిషన్ ప్రాంతం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి చినతిరునాళ్ల మూడోరోజు బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మునేరులో పెద్ద ఎత్తున గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు రాత్రి సమయంలో ఆలయ ప్రాంగణంలో బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తూ కాలక్షేపం చేశారు. ఎగ్జిబిషన్ వద్ద భక్తులు కోలాహలం కనిపించింది. భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తున్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి



బండిపాలెం(జగ్గయ్యపేట): ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని చిల్లకల్లు ఎస్ఐ సతీష్ కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం రాత్రి ఆయన పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను అందరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని, అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.15.39లక్షలు



నందిగామ: మండలంలోని అంబారుపేట శ్రీసత్యమ్మ అమ్మవారి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. 146 రోజులకు గాను భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.15,39,268 వచ్చినట్లు ఆలయ ఈవో సీతారామయ్య తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.


పంట మార్పిడి విధానంతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు

ముక్కపేట(వత్సవాయి) :రైతులు పంటమార్పిడి విధానాన్ని రైతులు ఖచ్చితంగా అమలు చేయాలని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.కృష్ణంరాజు సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన భాగస్వామ్య గ్రామీణ అంచనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడు నెలలపాటు గ్రామంలో ఉండి రైతులు పంటల సాగుచేసే విధానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులు మూస పద్ధతిలో వ్యవసాయం చేయకుండా ఏటా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడి రసాయనిక ఎరువుల వినియోగంతో భూమిలో సారం తగ్గిపోయిందన్నారు. ప్రతి ఏడాది తప్పకుండా పశువుల ఎరువుతోపాటు మేకల, గొర్రెల మందలను పొలాల్లో నిలుపుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సుమారు 40రోజుల ముందు పొలంలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకుని తర్వాత కలియదున్నుకుంటే భూమిలో సారం పెరుగుతుందని వివరించారు. శాస్త్రవేత్త ఐ.వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు కొండబోలు వెంకటబ్రహ్మం, వ్యవసాయ కళాశాల విద్యార్థులు జి.శ్రీను, ఆర్.రాజేంద్ర, ఎస్.సత్యనారాయణరెడ్డి, బి విజయభాస్కర్‌రెడ్డి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో ఆలయం

నందిగామ: పట్టణ శివారు అనాసాగరంలో గ్రామదేవత ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.గ్రామంలో ముత్యాలమ్మ , పోతురాజుల విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలతో భాగంగా బుధవారం సాయంత్రం పలు రకాల హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. మండపారాధనతోపాటు పలు దేవతామూర్తులకు పూజలు చేశారు. ఆయా పూజల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను విస్మరించవద్దు

దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు



మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతలతో ముందుకు సాగినప్పుడే తాము చదివిన విద్యకు సార్థకత లభిస్తుందని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కేఎస్ రామారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. సామాజిక చైతన్యంతో పాటుగా బాధ్యతయుతంగా ముందుకు సాగాలన్నారు. మారుతున్న పరిస్థితులను గమనిస్తూ తమను తాము తీర్చిదిద్దుకోవాలని కోరారు. కేబీఎన్ కళాశాల 59 సంవత్సరాల ప్రస్థానం విజయవంతంగా కొనసాగించటం ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరంలో వివిధ రంగాల్లో సాధించిన విజయాలను వివరించారు. కళాశాల సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):వివాహిత అదృశ్యంపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వజ్జా రమేష్ కుటుంబ సభ్యులతో కలసి పూర్ణానందంపేట, జోసఫ్‌స్ట్రీట్‌లో నివాసముంటున్నారు. భార్యాభర్తలు వేర్వేరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో భార్య తనతో పాటు పనిచేసే తోటి ఉద్యోగికి ఆమె పేరుమీద లోన్‌లు ఇప్పించింది. ఈ విషయం తెలియడంతో భర్త ఎందుకు ఇప్పించావంటు అడిగాడు. దీంతో ఆమె భర్తకు తెలియకుండా ఇంట్లోని బంగారు ఆబరణాలను తోటి ఉద్యోగికి ఇచ్చి లోన్లు క్లియర్ చేయించింది. ఈ విషయం కూడా తెలియడంతో బంగారం ఎందుకు ఇచ్చావంటు భర్త మందలించాడు. ఆనంతరం మంగళవారం ఉదయం 9 గంటలకు భర్త ఆఫీస్‌కు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో భార్య ఫోన్ చేసి తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని చెప్పి స్విచ్ఛాఫ్ చేసింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూడగా భార్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తన భార్య కనిపించడం లేదంటు ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో విప్ ఉదయభాను



పార్టీలో చేరిన బలుసుపాడు నాయకులతో విప్ ఉదయభాను

వత్సవాయి :మండలకేంద్రం వత్సవాయి గ్రామానికి చెందిన చంద్రగిరి బాబు, రాయల రామకృష్ణ, చల్లా రంగ, రామకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వర్లు తదితరులు తెలుగుదేశం పార్టీని వీడి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. గతంలో వీరు వైఎస్సార్ సీపీ నుంచి అనివార్య కారణాలతో టీడీపీలో చేరారు. అక్కడ ఇమడలేక మరలా సొంతగూటికి వచ్చారు. వీరికి ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఉదయభాను సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరారావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ భూక్యా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలుసుపాడు నుంచి చేరిక..

జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జగ్గయ్యపేట నియోజకవర్గంలో అనేక మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వర్లు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వరరావు, బండ్ల లాజర్, అమ్మనబోయిన చిన్నదీనారావు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి ఉదయభాను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎన్నికలకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు హనుమయ్య, గ్రామపార్టీ కన్వీనర్ ఆతుకూరి గోపాలరావు, సర్పంచి యడ్లపల్లి సూర్యప్రకాష్, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, కెడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.10లక్షలతో బోరుపంపు ఏర్పాటు



పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్

కంచికచర్ల : వేసవికాలంలో గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు మరో కొత్త బోరుపంపు నిర్మాణం చేపట్టి పైపులు ఏర్పాటు చేస్తున్నామని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. మండలంలోని కీసర మున్నేటి ఒడ్డున గండేపల్లి గ్రామానికి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా కోసం వేసిన బోరు పంపునకు బుధవారం పైపులుఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.1.10లక్షలతో బోరుపంపు ఏర్పాటు పనులు చేపట్టినట్లు తెలిపారు. కీసర మున్నేటిలో జలాలు అడుగంటడంతో బోరు పంపులకు నీరు అందక విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయన్నారు. దీంతో సమస్య పరిష్కారానికి బోరుపంపు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. హేమమాలిని తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల పరిధిలో బుధవారం రాత్రి దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 20 వార్డులలో దోమల నివారణకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాత్రిపూట ఫాగింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా దోమలను పూర్తిగా నివారించేందుకు కల్వర్టుల వద్ద ఫాగింగ్ చేయడంతో పాటు పలు నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫాగింగ్ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం పర్యవేక్షించారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలి



రాయప్పను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమకు ఫిర్యాదు చేయాలని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇనుపనుర్తి శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇనుపనుర్తి శ్రీనివాసరావును పవర్ స్టేట్ హ్యూమన్ రైట్స్ సౌత్ రీజియన్ ప్రెసిడెంట్, రిపబ్లిక్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కె.రాయప్ప కలిసి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటామి తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరూ బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆర్‌వో వెంకటేశ్వర్లు



రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌వో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు

జగ్గయ్యపేట అర్బన్: మోడల్ కోడ్ ఆఫ్ కాంటక్ట్ పాటించని రాజకీయపార్టీలపై చర్యలు తీసుకుంటామని జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) జి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, పార్టీలు పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా ఓటర్ల వద్దకు వెళ్తున్న రాజకీయపార్టీల నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల్లో ఆయా పార్టీలు, అభ్యర్థులు చేపట్టే ప్రతి కార్యక్రమానికి అనుమతి తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ ప్రచారం, కరపత్రాల ముద్రణ, పంపిణీ, సభలు, సమావేశాల నిర్వహణ, వాహనాలకు మైక్ ఏర్పాటు తదితర కార్యక్రమాలన్నింటికీ ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. రాజకీయనాయకులు, పార్టీల కార్యక్రమాలపై నిఘా ఉంటుందని, ప్రతి అంశాన్ని వీడియా తీసి వివరాలు నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఆయా పార్టీల నాయకులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు ప్రధాన పార్టీల వారిపై ఒక్కొక్కటి చొప్పున కేసు నమోదు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఏఆర్‌వో, తహసీల్దార్ శేషగిరి, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, పేట ఎంపీడీవోలు రమేష్‌బాబు, ఎన్నికల డీటీ కిషోర్, వైఎస్సార్ సీపీ తరపున తన్నీరు నాగేశ్వరరావు, తుమ్మల ప్రభాకర్, నాగరాజు, టీడీపీ నుంచి ఎస్.రామ్మూర్తి, నాగుల్ మీరా, బీజేపీ నుంచి మన్నె శ్రీనివాస్, జనసేన నుంచి ఈమని కిషోర్, కాంగ్రెస్ నుంచి దాచేపల్లి వీరభద్రరావు, బీఎస్పీ నుంచి కొదమల ప్రభుదాసు, కేవీరత్నం పాల్గొన్నారు.

నందిగామ ఆర్డీవో కార్యాలయంలో...

నందిగామ: అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని ఆర్డీవో ఏ రవీంద్రరావు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై తన కార్యాలయంలో బుధవారం ఆయన ఆయాపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు సంబంధించి తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేయరాదన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమాలకు సంబంధించి పలు సూచనలతో కూడిన పత్రాలను రాజకీయపక్షాల ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ సరస్వతి, ఎలక్షన్ డీటీ ఇస్మాయిల్, ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై వడ్డీ మినహాయింపు

నందిగామ: పట్టణ పరిధిలోని ఇంటిపన్ను, ఖాళీస్థలాల పన్ను చెల్లింపుదారులు ఈనెల 31వతేదీలోగా బకాయిలు చెల్లించి, వడ్డీ మినహాయింపు పొందాలని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్ను వడ్డీ మినహాయింపుతో చెల్లించేందుకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేక, శ్రీచక్రనవావరణార్చన

విజయవాడకల్చరల్: భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 8 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాన్యాసం, శ్రీ చక్రనవావరణార్చన, సాయంత్రం ఆది దంపతులకు త్రిశతి, మహామంగళ హారతి, వేదాశీర్వచనం నిర్వహించారు. వేదపండితులు చతుర్వేద పారాయణం పఠించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విదుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో 73 రోజులపాటు 15 మంది రుత్వికులచే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.